


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఎపిసోడ్ 1: (జనవరి)*

*శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో ఆ8 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.*

✿✿✿

*ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)*

*రాబీ వెబ్‌స్టర్ అనే  అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.*

✿✿✿

*ఎపిసోడ్: 3 (మార్చ్)*

*శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.*

*జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.*

✿✿✿

*ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.*

✿✿✿

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ –10

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

"భాష అంటే కేవలం మాటలు, అక్షరాలు, అర్థాలు ఛందస్సు భావప్రకటనలు, ఆవేశ ప్రదర్శనలూ కావు. వీటన్నిటికీ అతీతమైనది. అది సర్వోత్కృష్టమైన విశ్వంలో శరీరం ధరించిన ప్రతి జీవికీ వున్నది. చెట్టు భాష చెట్టుది. పుట్ట భాష పుట్టది. చెట్టు చెప్పేది వినండి" అన్నారు యజ్ఞప్ప.

"నాలాగా గతాన్ని ఆకులు రాల్చేసినట్టు రాల్చేసుకో"

"నాలాగా సరికొత్త భావాల్ని చిగురాకుల్లా తొడిగేసుకో"

"నేను కాసిన పళ్ళని ఉచితంగా ప్రేమగా అందరికీ అందిస్తా. ఏనాడూ నా ఫలాల్ని నేను తినను. కాసేది ఇతర్లకోసమే"

"నాకు ఫలాలే లేకపోవచ్చు. సువాసనలు చిమ్మే పువ్వులూ లేకపోవచ్చు. కానీ పక్షులకి నిలువనీడనిస్తాను. మనుషులకీ నీడనిస్తాను. మీరు నిశ్వాసించే బొగ్గు పులుసు ప్రాణ వాయువుని నేను పీల్చుకుని, శుభ్రం చేసి, స్వచ్ఛమైన ప్రానవాయువుని మీకు అందిస్తాను. మీరో పక్క నా కొమ్మల్ని నరుకుతున్నా సరే."

"ఊయలగా మిమ్మల్ని అలరించేదీ నేనే, మంచాన్నై, కుర్చీనై, విశ్రాంతి నిచ్చేదీ నేనే, వంట చెరకునై ఆహారాన్ని పక్వం చేయడంలో సాయపడేదీ నేనే, ఆఖరికి మీరు చనిపోయినప్పుడు పాడెగా మిమ్మల్ని మోసుకెళ్ళి మీతోపాటు చితిలో కాలిపోయేదీ నేనే. కానీ నేస్తమా, నువ్వు మాకు తిరిగిచ్చేది క్షణానికో మృత్యువుని. అగ్గిపుల్లగా మమ్మల్నే వాడి మమ్మల్ని తగలబెడతావు. అయినా క్షమిస్తాం. "అన్నాయి చెట్లు.

"ఇవన్నీ చెట్లు, వృక్షాలు మనకి చెబుతూనే వుంటాయి. మనం వినం. వినిపించుకోం. కారణం వాటి భాషని మర్చిపోయాం. కారణం మన భాషల్ని మనం సృష్టించుకోవడమే" అన్నారు యజ్ఞప్ప.

"అవునూ.. భాష సంగతి ఎందుకూ?" అడిగాడు జయ్.

"జయ్.. వారు భాష గురించి చెప్పేదానిలో ఎంతో అర్థం వుంది. ప్రస్తుతం మనం వినాల్సింది ప్రకృతి భాష. ఏ పని చేయడానికి ఏ సమయం సరైనదో సరిగ్గా నిర్ణయించగలది ప్రకృతి ఒక్కటే. మనం సృష్టించుకున్న పంచాగమూ, గణితమూ కూడా ఆధారపడింది ప్రకృతి మీదనే. కొన్ని భాషలకి 'శబ్దం' మూలమైతే, ప్రకృతి భాషకి మూలం శబ్దం కాదు. 'సంజ్ఞ'" ఆగారు శాస్త్రిగారు.

"ఆ భాష ఎలా తెలియబడుతుందీ?" అడిగాడు జయ్.

"హిమాలయాల్లో నివశించే యోగులకి ఆ భాష తెలుసు. వనాల్లో నివశించే వననరులకీ కొండల మీద నివశించే గిరిజనులకీ, ముఖ్యంగా భిల్లులకీ ఆ భాష తెలుసు. అంటే, వారి మనసులకి అవగతం అవుతుందన్నమాట" చెప్పారు శాస్త్రి.

"ప్రస్తుతం మనం వేచి చూస్తున్నది రాబర్ట్ స్పృహలోకి రావడం గురించి. అవునా?" అడిగాడు జయ్.

"అంతేకాదు. ఆ నాడు ఆహారపదార్థాలు ఇచ్చి కనపడకుండా పోయిన శ్రీనివాస్ గురించి కూడా. విలియమ్స్ అనే ఆత్మ తోడుండగా శ్రీనివాస్‌కి ఏ ఆపదారాదు. అది నూటికి నూరుపాళ్ళూ నిజం. కానీ, అతను ఎక్కడున్నాడో, ఏ పరిస్థితుల్లో వున్నాడో తెలియడం మనకి ముఖ్యం. అసలీ సంఘటనలన్నీ ఎందుకు జరుగుతున్నాయో, వీటి వెనకాల వున్న

శక్తి ఏమిటో మనకి తెలియాలి. ఆ విషయం తెలీకుండా రోజుల తరబడి నిర్వ్యాపారంగా మనం గడపలేము" స్పష్టంగా చెప్పారు శాస్త్రిగారు. తల పంకించాడు జయ్. పనీపాటూ లేకుండా గడపడం అతనికీ దుర్భరంగానే వుంది.

"అదే విచిత్రం. వాననరులకీ, గిరిజనులకీ ఆ భాష అర్థం కావడానికి కారణం ఏమిటో తెలుసా? వారికి ఓపిక ఎక్కువ. ఎన్ని గంటలయినా, ఎన్ని రోజులయినా వారు వేచి చూడగలరు. ఓ పులి కోసమో, మరోజీవి కోసమో మాటు పెట్టినవాడు రోజుల తరబడి ఎదురు చూస్తూనే వుంటాడు. అసలు మనం దేన్ని నేర్చుకోవాలన్నా గమనించడం ముందు నేర్చుకోవాలి. గాలిలో మార్పు. మొక్కల కదిలికల్లో మార్పు, శబ్దంలోని మార్పు అన్నీ గమనించడం నేర్చుకోవాలి. అతి సూక్ష్మ భేదాల్ని సరిగ్గా గుర్తించగలగడమే నిపుణుడి లక్షణం" చిన్నగా నవ్వి అన్నారు యజ్ఞుప్పు. జయ్ మౌనంగా విన్నాడు.

"బహుశా నీకిదంతా కొత్తగా వుండొచ్చు జయ్. వర్షాలు ఎప్పుడొస్తాయో ఇవ్వాళా రేపు వాతావరణ శాఖవారి వార్తల మీద ఆధారపడుతున్నాం. ఒకప్పుడు సూక్ష్మ దృష్టిగల ప్రతి వ్యవసాయదారుడు వర్షాగమనాన్ని ఖచ్చితంగా గుర్తించేవాడు. భూకంపం వచ్చే కొన్ని గంటల ముందే భూమిలో జీవించే అనేక ప్రాణులు బిరియాలలోంచి బయటకి వచ్చి సురక్షితమైన చోట్లకి పరిగెడతాయి. వర్షానికి ముందే కొన్ని రకాల పక్షులు గూళ్ళకి చేరేందుకు తొందరపడతాయి. అబ్బాయ్.. మనదికాని పని కూడా ఒక్కోసారి మనం చెయ్యాల్సి వుంటుంది. ఆ సమయంలోనే మనం ఎక్కువ ఓర్పుని వహించాలి. ఇలా గడపడం దుర్భరం అని తెలుసు. కానీ ఏ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంతవరకో నిర్ణయించేది కాలమే. ఓ విధంగా మనందరం కాలపు చేతుల్లోని పనిముట్లం మాత్రమే" ఓపిగ్గా వివరించారు శాస్త్రిగారు.

"మట్టూ రాముడ్ని సృష్టించిందీ కాలమే.. రావణాసురుడ్ని సృష్టించిందీ కాలమే. మంచినీ చెడునీ కూడా సృష్టించింది కాలమే. కాలానికి మంచీ, చెడు అనే భేదాలు లేవు. పాపం పుణ్యం, స్వర్గం నరకం, కష్టం సుఖంలాంటి ద్వంద్వాలూ లేవు. అవిచ్ఛిన్నంగా సాగిపోవడం దాని లక్షణం. కానీ దాన్ని 'కొలవడం' కనిపెట్టాడు మనిషి. ఘడియలుగా, విఘడియలుగా రోజులుగా, నెలలుగా దశాబ్దాలుగా, శతాబ్దాలుగా కాలాన్ని మనిషి విభజిస్తూనే వున్నాడు. తను కనిపెట్టిన గణిత శాస్త్రంతో. గణితం దైవ ప్రసాదం. ఆ గణితం మీద ఆధార పడిందే జ్యోతిష్యం. అయితే ఆ రెండు విద్యలూ కాల గమనాన్ని చెప్పగలవూ, గుణించగలవూ గానీ, కాల రహస్యాన్ని సూచించలేవు. ఆ రహస్యాల్ని శోధించడం కొందరికి మాత్రమే సాధ్యం. లేదా కాలమే తన రహస్యాన్ని తానే ప్రకటించుకోవాలి. మీరిద్దరూ ఇక్కడికి వచ్చి నలభై రెండు రోజులయింది. మీ గురువు నిర్దేశించిన సమయం కూడా పూర్తయింది. ఎల్లుండి పౌర్ణమి. అనేకానేకమంది సాధు సన్యాసులు, మౌన మునులూ, రుషి స్వాములూ ఇక్కడికొస్తారు. ఇటువంటి రోజు మళ్ళీ రావాలంటే పాతికేళ్ళు పడుతుంది. ఈ రోజంతా ఆటవికుల సహాయం తీసుకుని యీ ప్రాంగణాన్ని శుభ్రం చెయ్యండి. వంటలకీ వార్పులకీ రావలసిన వారు మరో రెండు ఘడియాల్లో వస్తారు. మీ పనల్లా గుడీ, గుడి ప్రాంతము అద్దంలా తీర్చి దిద్దటమే" లేచినిలబడ్డాడు నీలుడు. నీలుడు మట్టు సహాధ్యాయి. వయసులో కొంచెం పెద్దవాడు.

"అలాగే" మట్టు గొంతులో స్నేహ వాత్సల్యం.

"మీ స్నేహితుడు చాలా చిక్కినట్టున్నాడు కదూ. అయినా ఆరోగ్యంగా ఉన్నాడు" నవ్వి అన్నాడు నీలుడు.

"ఇంతకు ముందు నన్ను చూడలేదుగా మీరూ?" ఆశ్చర్యంగా అన్నాడు శృంగి.

''మీరు పనిచేసి పడుకుంటారు. మాకు పడక అనేది వుండదు. అడవిలో బ్రతికే జీవులు నిద్రించవు. కేవలం విశ్రాంతి తీసుకుంటాయి. ఆ విశ్రాంతిలోనూ అప్రమత్తంగానే వుంటాయి. నేనిక్కడికి చాలాసార్లు వచ్చాను. అయితే ఆ సమయం మీకు నిద్రా సమయం గనుక నన్ను మీరు చూడలేదు'' నవ్వి అన్నాడు నీలుడు.

''రాబోయే రుషులూ మునీశ్వరులూ ఎక్కడ్నించి వస్తారూ?'' అడిగాడు శృంగి.

''గాలికి వూరేదీ? సువాసనకి పేరేదీ? రుషి మూలం తెలిసేది భగవంతుడికే. అయినా వారు చాలా సౌమ్యులు దేన్నీ ఎవరినించీ ఆశించరు'' నవ్వాడు నీవాడు.

''`ఆశించరు` అనడంలో ఇతని అర్థం ఏమిటీ?'' అని తనలో తననే గొణుక్కున్నాడు శృంగి.

''అయ్యా నా ఉద్దేశ్యం ఏమంటే ఆ మహానుభావుల్నించి మనం ఏ సమాధానాలూ ఆశించకూడదని. అంటే వారిని ప్రశ్నలతో విసిగించకూడదని'' పకాల్న నవ్వి అన్నాడు నీలుడు.

''మళ్ళీ మళ్ళీ మీరు అనుకున్నది నాకు ఎలా తెలిసిందా అని ఆలోచించకండి. మీ ముఖం అద్దంలాంటిది. అందులో అన్ని భావాలూ అన్ని వేళలా ప్రతిఫలిస్తూనే వుంటాయి'' లేచి చెయ్యి వూపుతూ సాగిపోయాడు నీలుడు.

''నేనూ కొందర్ని తీసుకొస్తాను'' తనూ లేచాడు మట్టు.

పద్దెనిమిది చేతుల అమ్మవారి చిత్రాన్ని రకరకాల, రంగురంగుల పూలపొడులతో చిత్రించారు సంకల్పానంద. ఆయన వయసు తొంబై ఏళ్ళ పై మాటే. అయినా నడకలో ఆయన వేగాన్ని అందుకోవడం అంత తేలిక కాదు. నిరంతర ఉపవాసాల వల్ల మనిషి సన్నగా రివటలా వున్నా, జప తప ధ్యానాదుల వల్ల మొహం తేజోమయంగా వుంది. ఉదయాన్నే ఓ చక్కని చోటు చూసి, గడ్డిని తొలగించి, కళ్ళాపి చల్లించి, ఆవుపేడతో అలికి ఆ తరవాత బియ్యపు పిండితో రేఖా మాత్రంగా పద్దెనిమిది అడుగుల బొమ్మగీసి రంగుపూలపొడితో బొమ్మ రచించడం పూర్తి చేసేసరికి సాయంకాలమైంది. మంచినీళ్ళు కూడా తాగలేదాయన మధ్యలో

అమ్మవారి చిత్రం సజీవంగా వుంది. నవ్వులు చిలుకుతోంది. కళ్ళలో ఏవో భావాల్ని సూచిస్తోంది. చూచిన సాధు సన్యాసులందరూ మంత్ర ముగ్ధులయ్యారు.

''ఒకవేళ వర్షం వస్తే?'' మట్టుతో మెల్లగా అన్నాడు శృంగి.

''శృంగీ.. రాదు... విజ్ఞులు ఏపని ప్రారంభించినా సంపూర్ణ నమ్మకంతో ప్రారంభిస్తారు. వచ్చినవారందరికీ జ్యోతిష్యమూ గణితమూ వేళ్ళ అంచుల మీద వుంటుంది. అదీకాక, స్వలాభం కోసం ఏం చేసినా, దాని జయాపజయాలు నిర్ణయించేది నీ నుదట వ్రాసిన విధిరాతే. అదే విశ్వశాంతి కోసమో, ఇతరులకు మేలు కలగటం కోసమో చేసే పవిత్ర కార్యాలకు ప్రకృతి ఎప్పుడూ తోడుంటుంది'' తీక్షణంగా అన్నాడు మట్టు.

''ఓయీ, నేను నిరాశావాదిననో నిత్య సందేహిననో నువ్వు అనుకుంటూ వుండొచ్చు. నువ్వు `మంచి` వైపు ఆలోచిస్తే, నేను చెడు వైపే ఆలోచిస్తానని కూడా అనుకోవచ్చు. ప్రకృతి, దైవమూ అనుకూలించినా అనుకూలించకపోయినా మానవ ప్రయత్నమనేది మంచీ చెడూ ఆలోచించేగా చెయ్యాల్సింది? అదీగాక ఇంతమంది ఒక చోట చేరి ఒక మహత్కార్యాన్ని తలపెట్టినప్పుడు కొన్ని కనీస జాగ్రత్తలు పాటించనక్కరలేదా?'' తీవ్రంగానే మట్టుకి జవాబిచ్చాడు శృంగి.

''అపశకునం తొలగింపబడుగాక'' ఇద్దరి మాటలూ విన్న ఓ సాధువు అన్నాడు. ఆ సాధువు కళ్ళల్లో కొంత అసహనం.

"క్షమించండి. నావి అపశకునపు మాటలు కావు. ఆలోచనలు మనసులో పుట్టే అలలు. అయితే, అన్ని అలలూ చెలియలి కట్టను ఢీ కొని తల వొంచుకుని వెనక్కివెళ్ళి పోవు. కొన్ని భీకరంగా చెలియలి కట్టని ముంచేసి వూళ్ళకి వూళ్ళని ఛిన్నాభిన్నం చేస్తాయి. మీరు చేయబోతున్న కార్యక్రమపు స్వరూపం నాకు తెలీదు. కానీ, నా మనసులో ఓ తెలియని అలజడి తుఫానులా రేగుతోంది. అమ్మవారి పెదాలు నవ్వులు చిలుకుతున్నట్టుగా వున్నా, కళ్ళలో ఓ ప్రళయ భయంకరమైన సూచన నా కళ్ళకి కనిపిస్తోంది. గుడిలో అమ్మవారి రూపు వేరు. ఇక్కడి రూపు అచ్చం అలాగే వున్నా అదికాదు. అభయ హస్తం బదులు నాకు ఆయుధం ధరించిన హస్తం కనిపిస్తోంది. పద్దెనిమిది చేతుల జగన్మాత ముఖంలో ఆందోళన ఎందుకూ? అమ్మవారి ముఖంలో కనబడాల్సింది దుష్ట శిక్షణ చేసే రౌద్రం. కానీ కనపడుతున్నది శాంతం. ముఖంలో నవ్వు కళ్ళల్లో ప్రళయ సూచన. అంటే యీ మహా కావ్యంలో అమ్మవారి పాత్ర కేవలం సాక్షి స్వరూపమేనా?" తనకే తెలియని ఓ ఉన్మత్త స్థితిలో అనర్గళంగా మాట్లాడాడు శృంగి. ఆ మాటలు కూడా మెల్లగా రాలేదు. మేఘ గర్జనలా వచ్చాయి. అందరూ వినేంత శబ్దంతోనూ, గాంభీర్యంతో కూడిన విహ్వలతతోనూ వినిపించాయి.

అందరి కళ్ళూ ఒక్కసారి 'ముగ్గు' వైపు చూశాయి. శృంగి మాటల్లోని యదార్థం అందరికీ గోచరించింది. నిశ్చలంగా వున్నది సంకల్పానంద ఒక్కరే. అందరి మనసులూ ఆందోళనతో నిండిపోయినా, చిరునవ్వు నవ్వింది సంకల్పానంద ఒక్కరే.

"బంధూ.. అమ్మ రూపు ఎలా వుండాలన్నది ఆమె సంకల్పం. నేను కేవలం ఓ పనిముట్టుని మాత్రమే అయినా, రావణుడూ, రక్తబీజుడూ, మహిషాసురుడు, నరకాసురుడూ కూడా జగన్మాత ప్రసవించిన బిడ్డలు కారా? ఓయీ .. జగన్మాతకి యీ విశ్వమే ఓ క్రీడాస్థలి. 'జనన మరణాలు అనేవి కేవలం ఓ లీల మాత్రమే. కాలానికి జనన మరణాలేవీ? అయినా బిడ్డా నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్ళూ నిజమే. రాత్రికి రాత్రే మండపంలో మరో ముగ్గు వేస్తాను" ఆశీర్వదించి అన్నారు సంకల్పానంద.

క్షణాల్లో గుడి మండపంలోని సామాన్లు ఖాళీ చేయబడ్డాయి. నూనె దివ్వెల కాంతులతోనే మండపం కడబడింది. గుడ్డలతో తుడవబడింది. వేయబోయే చిత్రాన్ని మనసులో సంపూర్ణంగా భావించుకోవాలిగా మరి.

కొందరు భిల్లులు, గిరిజన యువకులూ కుండలలో నింపిన రంగురంగుల పూలపొడులను సంకల్పానందకి దగ్గరలో నిశ్శబ్దంగా పెడుతున్నారు. గుడికి ఆగ్నేయాన వున్న వంటశాలలో ఎక్కడినించో రావించబడిన వంట బ్రాహ్మణులు వంటలు చేస్తున్నారు. ఉపవీతాలు ధరించిన బ్రాహ్మణ బాలకులు అన్న సూక్తాన్ని ముక్త కంఠాలతో పఠిస్తున్నారు. గుడి ప్రాంగణమంతా దివిటీల వెలుగులో కళకళలాడుతోంది.

ఉన్నట్టుండి గాలి స్థంభించింది. అప్పటిదాకా కాళహస్తిలోని వాయులింగపు జ్యోతిలా రెపరెపలాడుతున్న దీపాలు, నిశ్చలమయ్యాయి.

చాలా చాలా చాలా దూరంగా ఎక్కడో సన్నని హోరు. ఉరుముల చప్పుడు. చీకటి నిండిన ఆకాశంలో సుదూరంగా ఫెటాల్న మెరిసిన తటిల్లతలు.

అందరూ నిశ్చేష్టులయ్యారు. అమ్మవారి పెదాలమీద చిరునవ్వు చెదరలేదు.

Post your comments

(కొనసాగింపు వచ్చే నెలలో)